# అగ్నిపరీక్ష

దేవుడంటే, భక్తి లేకపోయినా, దయ్యమంటే భయం చాలామందికి వుంటుంది. దేవుడు కరుణామయుడు, ఎవర్ని గురించీ అంతగా పట్టించుకోడు, కాని దయ్యాలు అలా కాదాయె?

కాని, కామేశానికి మాత్రం యీ భక్తీ భయం కూడా ఏనాడూ దగ్గరకు చేరలేదు. యిందుక్కారణం అతడు దేవాలయం పక్కనేవున్న పూరిపాకలో పుట్టటం, దయ్యాల మర్రి కింద పెరిగి పెద్దవాడవటం కావొచ్చు.

ఏమైతేనేం అతడు దండయాత్రలు కొట్టికొట్టి యిరవై ఏళ్ళకల్లా స్కూల్ ఫైనల్ ప్యాసై పోస్టాఫీసులో క్లర్కు గిరీ సంపాదించి బస్తీకి వచ్చేసరికి - యీ దయ్యం సమస్య రాక్షసిలా ఎదురైంది.

తను ఎరగని పట్టణంలో నానా శ్రమ పడి డాబా మీద గది పది రూపాయల అద్దెకు సంపాయించాడు.

డాబా మీద బాగా గాలివచ్చేచోట గది పది రూపాయలంటే - చాలా చౌకగానే కనబడింది. వారం రోజులకల్లా అందులో వున్న నిగూఢ రహస్యం కింది భాగాల్లో కాపరం వున్నవాళ్ళు చెప్పేశారు.

ఒకనాటి రాత్రి రెండో ఆట సినిమాకు వెళ్లి కామేశం తిరిగొచ్చాడు. బాగా రెండు నిలువుల ఎత్తునవున్న కాంపౌండు గోడ తలుపులు బిగించి వున్నయి. తలుపు దబదబ లాడించాడు. అది బాగా చలికాలమేమో, తలుపులు బిగించుకుని ముసుగులుతన్ని అందరూ నిద్దర్లు పోతున్నారు.

ఇది పనికాదని కామేశం ఆ రెండు నిలువుల ఎత్తుగోడ ఎక్కి లోపలకు దూకేశాడు. ఆ చీకట్లో అలా దూకటంలో కాళ్ళ కింద ఏదో పడి అరుస్తూ పారిపోయింది. ఆ అరుపును బట్టి పందికొక్కయి వుంటుందనుకున్నాడు కామేశం.

ఉదయానికల్లా కింద కాపరాలున్న వాళ్ళందరూ కామేశాన్ని చుట్టుముట్టి - 'తలుపు వేసివుంటే ఎలావొచ్చావు?' అంటూ ఆదుర్దాగా ప్రశ్నించారు.

కామేశం జరిగిందంతా చెప్పాడు - ఆ పందికొక్కు సంగతి మినహాయించి.

"గోడ దూకి సరాసరి వచ్చేశావా? మరేం...జరగలేదా?" అన్నారు వాళ్ళు.

"జరిగేదేమిటి?" అంటూ ఆశ్చర్యపోయాడు కామేశం.

"అంటే పురుగూ పుట్రా...యింకా" అంటూ నశిగారు వాళ్ళు.

అప్పుడు, గోడ దూకగానే తన కాళ్ళ కింద ఏదో పడి కీచుమంటూ పారిపోయిందని చెప్పాడు కామేశం.

"అద్గదుగో చెప్పలేదుటే...అదే అదే!" అన్నది ఒక ముసలావిడ ముసి ముసి నవ్వులు నవ్వుతున్న

పదహారేళ్ళ మనవరాలికేసి చేతులు తిప్పుతూ.

ఆ తరవాత కామేశానికి ఆ చుట్టూ మూగిన వాళ్ళల్లో ఎవరికి తోచిన సలహా వాళ్ళిచ్చారు.

యిప్పుడు కామేశం వుంటున్న గదిలోనే రెండేళ్ళ కిందట ఓ నిండు జవ్వని భగ్న ప్రణయాన్ని భరించలేక వురిపోసుకుందనీ, అప్పటి నుంచీ దయ్యమై....రకరకాల ఆకృతులు తాలుస్తూ, ఆ ప్రాంతం అంతా కలయ తిరుగుతున్నదనీ, కనక చీకటిపడితే అలా గోడలు దూకటం అదీ ప్రమాదం అని సలహా లిచ్చారు.

కామేశం అన్నిటికీ 'ఊ' కొట్టి డాబా మెట్లెక్కుతుండగా పకాలుమన్న అమ్మాయి నవ్వు - ఆ వెంటనే ముసలావిడ బొంగురు గొంతూ వినిపించినై.

"నీవేమో యింకా పదహారేళ్ళయినా నిండకుండానే యింత గడుగ్గాయివయి పోయావ్. పిల్లకాకికేం తెలుసు వుండేలు దెబ్బ అన్నారు. నాలుగు యింగిలీసు కీసరబాస వచ్చేసరికి దయ్యాలు లేకండా పోతాయా? యిక పద యింట్లోకి!" అంటూ ముసలావిడ మనవరాల్ని దబాయించింది.

కామేశం గదిలోకిపోయి ఆలోచనలో పడ్డాడు. ఈ గదిలోనే ఒక ప్రాణి, అందులోనూ ఒక నిండు జవ్వని వురిపోసుకుని హరోంహరి అనటం అంటే - అతడి మనస్సు చివుక్కుమన్నది. పాపం, అభాగ్యురాలు అనుకున్నాడు. కాని ఆవిడ దయ్యమై తిరుగుతున్నదనేది అర్థంలేని మాట కిందే జమకట్టాడు.

తరవాత ఆఫీసుకు వెళ్ళేందుకు కిందికి దిగివస్తూంటే ఆ పదహారేళ్ళ అమ్మాయి తనని చూసి అదోలా కళ్ళు ఏటవాలుగా కదిలించింది. ముసలావిడ అన్న మాటల్ని బట్టి నాలుగు ఇంగ్లీషు ముక్కలు వచ్చిన పిల్ల అనీ, తనలాగే దయ్యాలంటే నమ్మకం లేదనీ కామేశం గ్రహించాడు.

యీ కొద్ది సంఘటనా వాళ్ళిద్దరి మధ్యా ప్రణయానికి దారితీస్తుందని వూహించటం ఆఖరికి కథకుడిక్కూడా సాధ్యం కాదేమో! కాని, నిజానికి యిది చిలికి చిలికి ప్రళయం లాంటి ప్రణయానికే దారితీసింది.

ఒకటి రెండు రాత్రులు ఏ విశేషం లేకుండానే గడిచిపోయినై. కామేశం దాదాపు ఆ దయ్యం సంగతే మర్చిపోయాడు. తరవాత ఒకనాటి రాత్రి బాగా పొద్దుపోయిం తరవాత కామేశం బయట కాస్తోన్న వెన్నెల చూసేందుకు డాబా మీది పిట్టగోడ పక్కకు వచ్చి నిలబడ్డాడు.

వున్నట్టుండి అతడికి కింద గాజుల మోత వినబడింది. చూసేసరికి బాదం చెట్టు మొదల్లో మల్లెపూవులాంటి తెల్లచీర కట్టుకుని నిలబడ్డ ఒక స్త్రీ కనిపించింది.

కామేశం గతుక్కుమన్నాడు. ఒక్క క్షణకాలం 'దయ్యమా?' అన్న సంశయం కూడా కలిగింది. అంతలో తన అమాయకత్వానికి నవ్వుకున్నాడు కామేశం. మెట్లు దిగుదామా అని కామేశం అనుకునేంతలో ఆ స్త్రీమూర్తి ఆ పక్కనే వున్న కాకరపాదు పందిరి కింది చీకట్లో కలిసిపోయింది.

తెల్లవారింతరవాత వుండబట్టలేక రాత్రి తను చూసిన సంగతి కింది భాగాల్లో కాపరం వున్న వాళ్ళకి చెప్పాడు. అందరూ ముక్కుల మీద వేళ్ళు వేసుకున్నారు.

"నేను చెప్పలేదా నాయనా? నీవింకా అభం శుభం తెలియని పసివాడివి! ఎన్ని రూపాలు

మారుస్తుందని? ఆవులాగా, కుక్కలాగా....ఆఖరికి తాడిచెట్టులాగా కూడా కనబడటం చూసినవాళ్ళున్నారు. దయ్యాలు లేవని మాట అనుకోగానే సరిపోయిందా? మా మనవరాలు ప్రభ కూడా నీలాంటి కబుర్లే చెపుతుంది. సరే, ఎందుకైనా మంచిది ఆ విశ్వేశ్వరలింగాన్నడిగి యింత విభూది తెచ్చుకో!" అన్నది ముసలావిడ వణుకుతూన్న గొంతుతో.

ఇంత జరిగినా కామేశం తను చూసింది దయ్యమని నమ్మలేకపోయాడు. ప్రభ మాత్రం తనని చూసినప్పుడల్లా కళ్ళు అటూ యిటూ పరిగెత్తిస్తూ, ముసి ముసి నవ్వులు నవ్వుతూనే వుంది. ఇది ప్రణయానికి నాంది అన్న సంగతి కామేశం గ్రహిస్తూనే వున్నాడు. చదువుకున్న అమ్మాయి, చక్కని అమ్మాయి - పైగా నాలాగే దయ్యాలు, దేవుళ్ళంటే నమ్మకంలేని పిల్ల...ఏమో నా అదృష్టం అని కూడా నిట్టూర్పులు విడిచాడు.

తరవాత రెండు రాత్రుళ్ళు మామూలుగానే గడిచిపోయినై. కామేశానికి ప్రభను గురించిన తలపులు ముమ్మరం కాసాగినై. రాత్రిళ్ళు సరిగా నిద్రపట్టటం లేదు. సిగరెట్ ముట్టించి పిట్టగోడ కానుకొని నిలబడేవాడు.

ఒకనాటి రాత్రి అలా సిగరెట్ ముట్టించి నిలుచున్న అతనికి తిరిగీ బాదం చెట్టు మొదల్లో నల్లచీర కట్టుకున్న స్త్రీమూర్తి కనబడింది. కామేశం వులిక్కిపడ్డాడు. మళ్ళీ ఒక్క క్షణకాలం దయ్యమా అన్న అనుమానం కూడా కలిగింది. అంతలోనే తెప్పరిల్లాడు. పైగా ఒకవేళ ప్రభ ఏమో అన్న సంశయం కూడా వచ్చింది. యీ మధ్య ఆ అమ్మాయి ముసిముసి నవ్వులు జడివానలా కురిపిస్తోంది.

కామేశం సన్నగా దగ్గి చూచాడు. చెట్టు కింద నల్లచీర కదల్లేదు. ఎవరో తేల్చుకుంటే సరిపోతుంది. దయ్యమే అయితే మాత్రం ఏం? జుట్టు పట్టుకుంటాను. ఎంత దయ్యం అయితే మాత్రం ఆడది అబలే గదా అనుకుంటూ డాబా మెట్లు దిగాడు.

గజం దగ్గరకు వచ్చేవరకు దయ్యం కదల్లేదు. ఆ తరవాత చెయ్యి వూపుతూ -

"నేను దయ్యాన్ని, దగ్గరకు రాకు!" అని కాస్త హెచ్చుస్థాయిలోనే పలికింది.

"నువ్వు దయ్యానివి కాదు ప్రభవి! ఆ మాత్రం పోల్చుకోలేనా?" అన్నాడు కామేశం.

"చెడిపోతావ్! నేను ముందే చెప్పాను దయ్యాన్నని. ప్రభ కాదు. కావాలంటే రంభ రూపం కూడా యిచ్చా మాత్రంతో తాల్చగలను. ముందు యిక్కణ్ణించి కదులు!" అన్నది దయ్యం.

ఆ మాటల్తో కామేశానికి గుండెలు జారినై. దయ్యం చెప్పేది ఆలోచించదగిన విషయంగానే తోచింది.

యీ లోపల దయ్యం కాస్తా కాకరపాదు పందిరి వెనక చీకట్లో కలిసిపోయింది.

కామేశం వుసూరుమంటూ గదికి తిరిగొచ్చాడు. యిక ఆ రాత్రికి నిద్దర పట్టలేదు. ఆ దయ్యం ప్రభ అయివుంటుందన్న అనుమానం అతణ్ణి బాధిస్తూనే వుంది.

తెల్లవారింది. ప్రభ కనబడిందిగాని - ఆ ముసి ముసి నవ్వుల్లో కొత్త సూచన ఏమీ కనబడలేదు. ఆ రాత్రి తాడోపేడో తేల్చుకోవాలనుకున్నాడు.

సరిగా అర్ధరాత్రికి ఆ దయ్యం యీసారి తెల్లచీర కట్టుకుని బాదం చెట్టు మొదట్లో నిలబడింది.

కామేశం సిగరెట్ వెలిగించుకుని సరాసరి దాని దగ్గరకు వెళ్ళి చెయ్యి పట్టుకున్నాడు.

"నువ్వు ప్రభవి! నాకు తెలుసు. నన్ను మోసగించలేవు. అలా కాకపోతే నువ్వు ఎప్పుడూ ప్రభ వేషంలోనే ఎందుకు కనపడతావ్?" అన్నాడు ధీమాగా.

దయ్యం నవ్వింది - ఓయి పిచ్చివాడా! అన్నట్టు.

"వురి తీసుకున్న అమ్మాయిని నేనే! ప్రభ వేషమంటావా - అందుక్కారణం వుందిలే. ఏదో మీ ఇద్దరి మధ్యా ప్రణయం కుంపటిలా రాజుకుంటున్నదని తెలిసి....ఏమయితేం నీ చేతిలో చిక్కాను" - అంటూ కిలకిలమన్నది దయ్యం.

ఆ కిలకిల నవ్వు వినేసరికి కామేశానికి వళ్లు ఝుళ్ళుమన్నది. ఆ వెంటనే సంబాళించుకుని ముందు ప్లాను వేసుకున్న విధంగా, కాలుస్తూన్న సిగరెట్టును దయ్యం అరిచేతిలో పెట్టి గుప్పెట మూసి బిగించి పట్టుకున్నాడు.

ఇక దయ్యం గంతువేసి కేకపెట్టింది. ఆ కేకతో కామేశానికి గుండెలు అవిశిపోయినట్టయి, డాబా మీదికి పరిగెత్తాడు. కింద కాపరం వున్నవాళ్ళు తలుపులు తీసుకుని 'ఏమిటీ, యేమిటీ?' అంటూ బయటికి పరుగెత్తుకొచ్చారు.

"దయ్యం, దయ్యం" అన్న ఏడుపు వినబడింది, డాబా మీద గదిలో ముసుగు తన్ని పడుకున్న కామేశానికి. అతడికి జరిగిపోయిందంతా గజిబిజిగా వుంది. మెల్లిగా కునుకుపట్టింది.

తెల్లవారి డాబా దిగపోయేసరికి మూలుగులు వినిపించినై కామేశానికి. ముసలావిడ మెట్ల దగ్గిర ఎదురై -

"చూశావా నాయనా? ఆ గదుగ్గాయి వద్దంటే విన్నది కాదు. రాత్రి జరగవలసిందే జరిగింది. ఆ దెయ్యం యింత నిప్పుకణిక పెట్టి చెయ్యంతా కాల్చింది" అంటూ కళ్ళ నీళ్లు పెట్టసాగింది.

కామేశం గదిలోకి పోయి గోడ మీంచి బెత్తికలు కట్టి వూడుతున్న ఇంత సున్నం తెచ్చి -

"అవ్వా, ప్రభ యింకా మూలుగుతున్నట్టే వుందే, యిదుగో మంత్రించిన విభూతి కాస్త మిగిల్తే తెచ్చాను. ప్రభ ఎక్కడ?" అంటూనే గదిలోకి వెళ్ళాడు.

రోజూ ముసి ముసి నవ్వులు నవ్వే ప్రభ యివ్వాళ కామేశాన్ని చూస్తూనే ముక్కుపుటాలు ఎగర వేస్తూ, పళ్ళు కొరికింది.

"ఫర్వాలేదు. ఈ విభూతిని మజ్జిగలో కలిపి రాచుకున్నావంటే - రేపీపాటికి నయమైపోతుంది. ఇక ఆ దయ్యం సంగతి నేను ఆలోచిస్తాను!" అంటూ తను తెచ్చిన సున్నం ప్రభకు చూపించాడు.

మొత్తం మీద వారం రోజులకల్లా ప్రభ అరిచేతి గాయం మానిపోయింది.

కామేశాన్ని హృదయపూర్వకంగా క్షమించింది కూడా.

ఆ తరవాత వాళ్ళిద్దరి హృదయాలూ పడుగూ - పేకలా హత్తుకుపోయేందుకు ఎక్కువ కాలం పట్టలేదు.

❊

*(ఆంధ్రజ్యోతి మాసపత్రిక : 1940-49)*